క్లుప్తంగా

సీఎం జగన్‌ను కలిసిన ఎంపీపీ, జెడ్పీటీసీ



సీఎంతో ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి, దగదర్తి ఎంపీపీ, జెడ్పీటీసీ దంపతులు

కావలి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని దగదర్తి ఎంపీపీ తాళ్లూరు ప్రసాద్‌నాయుడు, జెడ్పీటీసీ స్వరూపరాణి దంపతులు సోమవారం కలిశారు. కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఎంపీపీ, జెడ్పీటీసీలను తాడేపల్లిలోని సీఎం క్యాంప్ కార్యాలయానికి తీసుకెళ్లారు. దంపతులను సీఎంకు ఎమ్మెల్యే పరిచయం చేశారు. సీఎంకు ఎంపీపీ, జెడ్పీటీసీ దంపతులు పూలబొకేను అందజేశారు.

మౌలిక వసతుల కల్పనకు చర్యలు



మాట్లాడుతున్న ఎంపీపీ శిరీష

కలిగిరి: గ్రామాల్లో పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పించడానికి చర్యలు తీసుకుంటామని ఎంపీపీ మెట్టుకూరు శిరీష తెలిపారు. కలిగిరిలోని ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం మండల సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు అమలుకు అధికారులు, ప్రజాప్రతినిధులు పరస్పరం సహకారం అందించాలన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు పాలూరు మాల్యాద్రిరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కులమతాలు, పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. శాఖల వారీగా అధికారులతో సమీక్షలు జరిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ జి.వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

అంతర కళాశాలల పోటీలకు విద్యార్థుల ఎంపిక



అంతర కళాశాల పోటీలకు ఎంపికైన విద్యార్థులు

ఉదయగిరి: బాపట్ల వ్యవసాయ విశ్వవిద్యాలయంలో మంగళవారం నుంచి జరిగే అంతర వ్యవసాయ కళాశాల ఆటల పోటీలకు మేకపాటి గౌతమ్‌రెడ్డి వ్యవసాయ కళాశాల విద్యార్థులు ఎంపికయ్యారు. సోమవారం కళాశాల డీన్ డాక్టర్ టి.గోపీకృష్ణ విద్యార్థులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించి మంచి ప్రతిభ కనపరచాలని సూచించారు. ఈ కళాశాల నుంచి 22 మంది విద్యార్థులు ఎంపికై నట్లు ఆయన తెలిపారు. అనంతరం విద్యార్థులకు క్రీడా దుస్తులు, షూ, క్యాప్‌లు అందజేశారు. కార్యక్రమంలో విభాగాధిపతులు కేఎస్‌ఆర్ పాల్, అనిల్‌కుమార్, కిషన్‌తేజ, బాలచంద్ర పాల్గొన్నారు.

నేత్రదానం



అలహరి వెంకటేశ్వరరావు (ఫైల్)

కావలి: పట్టణంలోని కచేరిమిట్టకు చెందిన అలహరి వెంకటేశ్వరరావు (84) వృద్ధాప్యంతో మరణించగా ఆయన నేత్రాలను కుటుంబ సభ్యులు రెడ్‌క్రాస్ సహకారంతో దానం చేశారు. నెల్లూరు మోడరన్ కంటి ఆస్పత్రి సిబ్బంది కార్నియాలను సేకరించారు. డాక్టర్ నక్కా రేవంత్‌కుమార్ ప్రేరణతో తమ తండ్రి నేత్రాలను దానం చేశామని కుటుంబ సభ్యులు తెలిపారు. నేత్రదాత కుటుంబ సభ్యులు అలహరి ప్రమీలమ్మ, శ్రీధర్, గిరిధర్, విశ్రాంత ఉపాధ్యాయులు నక్కా సాయిరాం, డాక్టర్ రమ్య, మోడరన్ కంటి ఆస్పత్రి టెక్నీషియన్ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

విలేజ్ క్లినిక్ సెంటర్ ప్రారంభం



విలేజ్ క్లినిక్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న సర్పంచ్ వెంకటేశ్వరరెడ్డి

ఉదయగిరి: మండలంలోని శకునాలపల్లి సచివాలయం ఆవరణలో నూతనంగా నిర్మించిన విలేజ్ క్లినిక్‌ను సోమవారం సర్పంచ్ కల్లూరి వెంకటేశ్వరరెడ్డి ప్రారంభించారు. ఇంత వరకు అద్దె భవనంలో ఉంది. రోగులకు మెరుగైన వైద్య సేవలందించేందుకు అవకాశం ఏర్పడింది. ఈ కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు కల్లూరి కృష్ణారెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, ఈర్ల శ్రీనివాసులు, వెంకటరెడ్డి, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో ప్రజలకు ఆర్థిక భరోసా

- అర్హులందరికీ సంక్షేమ పథకాలు
- ఉదయగిరి సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి



చోడవరంలో లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బుక్‌లెట్లను అందిస్తున్న రాజగోపాల్‌రెడ్డి

జలదంకి: రాష్ట్రంలో అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాల ద్వారా ప్రభుత్వం ఆర్థిక భరోసా కల్పించిందని ఉదయగిరి సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. పార్టీలు, కులమతాలు, వర్గాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేసిన ఘనత సీఎం జగనన్నకే దక్కిందన్నారు. మండలంలోని చోడవరం పంచాయతీలో సోమవారం ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఆయన ఇంటింటికీ వెళ్లి ఆప్యాయంగా పలకరించారు. ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. నాలుగున్నరేళ్లలో పథకాల ద్వారా పొందిన లబ్ధిని వివరించి సంక్షేమ పథకాల బుక్‌లెట్లను అందించారు. ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అన్ని వర్గాలను దృష్టిలో ఉంచుకుని పాలన సాగిస్తున్నారన్నారు. అవినీతికి తావు లేకుండా పారదర్శకంగా ప్రతి ఇంటికీ లబ్ధి చేకూర్చిన ఘనత జగనన్నదే అన్నారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా భావించి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారన్నారు. సీఎం జగన్ పాలనలో పారదర్శకత, పథకాల మంజూరులో వేగం, అభివృద్ధిలో నిర్ణయాత్మక నిర్ణయాలతో రాష్ట్రం సమగ్రాభివృద్ధి దిశగా అడుగులు వేస్తుందన్నారు. గ్రామాల్లో సీసీ రోడ్లు, జలజీవన్ మిషన్ పథకం ద్వారా ప్రతి ఇంటికీ ఉచితంగా నీటి కుళాయిలు ఏర్పాటు చేశామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు, ఇళ్లు అందిస్తున్నామన్నారు. నాకు ఎంతో అనుభవం అంటూ చెప్పుకోవడం తప్పా చంద్రబాబు ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. ఇక పవన్‌కళ్యాణ్‌కు రెచ్చగొట్టే ప్రసంగాలు తప్పా ఏమీ తెలియదని విమర్శించారు. మాయమాటలతో మభ్యపెట్టేందుకు వస్తున్న బాబు, పవన్ మాటలను నమ్మొద్దని అన్నారు. ప్రజా సంక్షేమం కోసం అహర్నిశలు శ్రమిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. చోడవరం ఎస్సీ కాలనీలో దాదాపు 30 మంది వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి రాజగోపాల్‌రెడ్డి పార్టీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పాలవల్లి మాలకొండారెడ్డి, సొసైటీ చైర్మన్ కేతిరెడ్డి రవీంద్రరెడ్డి, ఎంపీడీఓ బి. సింగయ్య, తహసీల్దార్ రమణారావు, స్థానిక సర్పంచ్ వల్లంరెడ్డి సుబ్బమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు రావి ప్రసాద్‌నాయుడు, వల్లంరెడ్డి నరసారెడ్డి, నన్నూరి ఆరోన్, పుచ్చకట్ల వెంకటేశ్వర్లు, సంపతి నర్సింహ, కాకర్ల మాలకొండారెడ్డి, తమ్మినేని సతీష్, గండు కృష్ణారెడ్డి, వర్ధినేని మురళీ, జాజుల మాధవరావు, గొట్టిపాటి ప్రసాద్, గుమ్మడి రమేష్, కాకాని మహదేవ, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

గురుకులంలో సమస్యలు పరిష్కరిస్తా



రికార్డులను పరిశీలిస్తూ విద్యార్థినిలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

- ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: తుమ్మలపెంట బాలికల గురుకుల విద్యాలయంలో విద్యార్థినులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటానని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి చెప్పారు. గురుకుల విద్యాలయాన్ని సోమవారం ఎమ్మెల్యే సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు, ప్రిన్సిపల్, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులతో ఎమ్మెల్యే మాట్లాడారు. గురుకుల విద్యాలయంలో వసతులను అడిగి తెలుసుకున్నారు. డిజిటల్ తరగతి గదులను క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థినిలకు ప్రభుత్వం అందజేసిన ట్యాబ్‌ల పనితీరును అడిగి తెసుకున్నారు. అర్ధంతరంగా నిలిచిన డైనింగ్ హాల్ నిర్మాణాన్ని పరిశీలించారు. డైనింగ్ హాలు లేకపోవడంతో 480 మంది విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నామని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఫ్లోరింగ్, బెంచీలు, తాగునీటి వసతి కల్పిస్తే డైనింగ్ హాలు అందుబాటులోకి వస్తుందని ప్రిన్సిపల్ కె. పద్మావతి ఎమ్మెల్యేకు వివరించారు. 18 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న గురుకుల విద్యాలయంలోకి ప్రవేశ మార్గంలో సరైన రోడ్డు వసతి లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. ప్రహరీ కొన్ని చోట్ల అసంపూర్తిగా ఉందని వివరించారు. ఆయా పనులు పూర్తి చేసి సమస్యలు పరిష్కరించడానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే సతీమణి ఆదిలక్ష్మి విద్యార్థినిలతో చదువు, ఆహారం, రక్షణ తదితర అంశాలపై మాట్లాడారు.

గడప గడపకు మన ప్రభుత్వం



కమ్మవారిపల్లిలో గడపగడపకు మన ప్రభుత్వం నిర్వహిస్తున్న ఎంపీపీ పెయ్యల సంపూర్ణమ్మ

సోమశిల: అనంతసాగరం మండలం పడమటికంభంపాడు పంచాయతీ కమ్మవారిపల్లిలో ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆదేశాల మేరకు ఎంపీపీ పెయ్యల సంపూర్ణమ్మ సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని ప్రతి గడపకు వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను వివరించారు. ప్రతి సంక్షేమ పథకం వారికి అందిందా లేదా అని ప్రశ్నిస్తూ వలంటీర్ల పని తీరు గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామస్తులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎంపీపీ మాట్లాడుతూ వచ్చే 2024 ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ గెలిపించుకుంటే రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి చేస్తారని, ప్రతి ఒక్కరూ జగనన్న సంక్షేమ ప్రభుత్వానికి తోడుగా నిలవాలని కోరారు. ఆమె వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు ఉన్నారు.

మైపాటివారికండ్రికలో విషాదం

చేజర్ల: మండలంలోని మైపాటివారికండ్రికలో విషాదం నెలకొంది. సాఫ్ట్‌వేర్ ఉద్యోగం పోయిందని గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మాలపాటి కిషోర్‌రెడ్డి(25) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం వేకువ జామున మృతి చెందాడు. గ్రామానికి చెందిన కిషోర్‌రెడ్డి చెన్నైలో కొంత కాలం పాటు సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేశాడు. ఉద్యోగం పోవడంతో గత నెల 30న మనస్తాపంతో ఇంటి వద్ద గడ్డి మందు తాగాడు. తొలుత స్థానికంగా వైద్య సేవలందించగా కొంత కాలం బాగానే ఉన్నాడు. ఆ తరువాత ఆరోగ్యం క్షీణించడంతో నెల్లూరు, తిరుపతి, చెన్నైకు తరలించి చికిత్స అందించారు. కొద్దిగా ఆరోగ్య పరిస్థితి మెరుగుపడంతో తిరిగి తిరుపతిలోని ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో సోమవారం వేకువన మృతి చెందాడు. చేజర్ల ఎస్సై మరిడి నాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా కిషోర్ ఆస్పత్రి పాలవడంతో మనస్తాపం చెందిన తండ్రి తిరుపాల్‌రెడ్డి ఈ నెల 12న తిరుపతికి వెళ్లి వస్తూ నాయుడుపేట వద్ద బస్సులో పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కొద్ది రోజుల వ్యవధిలోనే తండ్రి, కుమారుడు మృతి చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

జగనే ఎందుకు కావాలంటే..



సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఎంపీపీ ప్రసాద్‌నాయుడు

కావలి: గడిచిన నాలుగున్నరేళ్లుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్రంలో పేదల సంక్షేమ పాలన సాగుతోంది. అభివృద్ధి కొత్త పుంతలు తొక్కుతోంది. అందుకే మళ్లీ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ కావాలని దగదర్తి ఎంపీపీ తాళ్లూరు ప్రసాద్‌నాయుడు అన్నారు. దగదర్తి సచివాలయంలో సోమవారం ఏపీకి జగనే ఎందుకు కావాలనే కార్యక్రమాన్ని నిర్వహించారు. గడిచిన నాలుగేళ్ల కాలంలో జరిగిన అభివృద్ధి పనులు, అందజేసిన సంక్షేమ పథకాల వివరాలతో ఫ్లెక్సీని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ జగనన్న పేద ప్రజలకు అన్ని రకాలుగా అండగా ఉంటున్నారని, ఆయన్ను ప్రజలే ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. కథలు చెప్పి మోసం చేయడానికి చంద్రబాబు, టీడీపీ నాయకులు మళ్లీ వస్తున్నారని, వారిని తరిమేయాలన్నారు.

అల్లూరు: 'ఏపీకి జగనే ఎందుకు కావాలి' కార్యక్రమాన్ని మండలంలోని ఇందుపూరులో సోమవారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నేత కోడూరు సాధిక్ రెడ్డి మాట్లాడుతూ జగనన్న అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు అందించిన సేవ లు, మేలు, సంక్షేమం, అభివృద్ధిని చెబుతున్నామ న్నారు. 2024లో తిరిగి సీఎంగా జగనన్నను గెలిపించుకునే బాధ్యత అందరిపై ఉందన్నారు. సర్పంచ్ రెహానాబేగం, ఎంపీడీఓ శ్రీదేవి, ఈఓపీఆర్డీ వీరేంద్ర పాల్గొన్నారు.

సామూహిక సత్యనారాయణ వ్రతం

ఆత్మకూరు: పట్టణంలోని లక్ష్మీ, ఆండాల్ సమేత వెంకటేశ్వర స్వామి ఆలయంలో కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాన్ని నిర్వహించారు. సోమవారం ఆలయం పక్కనే ఉన్న కల్యాణ మండపంలో సుమారు 70 మంది దంపతులు సత్యనారాయణ స్వామి వ్రతం చేయించేందుకు పాల్గొన్నారు. అర్చకులు శాస్త్రోక్తంగా సత్యనారాయణస్వామి వ్రతాన్ని నిర్వహించారు.

మేకపాటి ఆర్థిక సాయం



అగ్నిప్రమాద బాధితులకు ఆర్థికసాయం అందజేస్తున్న రాజగోపాల్‌రెడ్డి

జలదంకి: మండలంలోని తిమ్మసముద్రం ఎస్సీ కాలనీకి చెందిన తలపల దుర్గాప్రసాద్ ఇల్లు ఇటీవల అగ్ని ప్రమాదంలో కాలిపోవడంతో సోమవారం ఉదయగిరి సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి చోడవరం గడపగడప కార్యక్రమంలో ఆ కుటుంబానికి రూ.20 వేలు ఆర్థిక సాయం అందించారు. కేశవరం సర్పంచ్ ఆ కుటుంబానికి రూ. 10 వేలు ఆర్థిక సాయం అందించారు. రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ బాధిత కుటుంబానికి గృహ నిర్మాణ శాఖ ద్వారా ఇల్లు మంజూరు చేయిస్తానని తెలిపారు. పాలవల్లి మాలకొండారెడ్డి, సొసైటీ చైర్మన్ కేతిరెడ్డి రవీంద్రరెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ తిప్పారెడ్డి ఇందిరమ్మ, నాయకులు పాల్గొన్నారు.

పేద కుటుంబానికి రూ.1.5 లక్షలు సాయం



ఆర్థిక సాయాన్ని అందజేస్తున్న పుత్తూరు నాగాచారి

కావలి: పట్టణంలో ఇటీవల ఆరోగ్య పరిస్థితి విషమించి మరణించిన పేద స్వర్ణకారుడు మహేష్ ఆచారి కుటుంబానికి సోమవారం కావలి స్వర్ణకారుల సంఘం అధ్యక్షుడు పుత్తూరు నాగా చారి ఆధ్వర్యంలో రూ.1.5 లక్షలు ఆర్థిక సహాయం చేశారు. నాగాచారి మాట్లా డుతూ ఆరోగ్యం సరిలేక ఇటీవల మరణించిన మహేష్ ఆచారి కుటుంబానికి కావలి స్వర్ణకారులు ఎల్లప్పుడూ అండగా ఉంటారన్నారు. స్వర్ణకారులకు ఎలాంటి కష్టం వచ్చినా తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో స్వర్ణకారుల సంఘం ప్రధాన కార్యదర్శి వెంకటేష్ ఆచారి, కోశాధికారి జరీఫ్, సహాయ కార్యదర్శి ముని కుమార్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

భారీ వర్షం



చిత్తలూరులో జలమయం అయిన వీధి

చేజర్ల: బంగాళాఖాతంలో కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం కారణంగా మండలంలో సోమవారం ఉదయం నుంచి చిరుజల్లులతో మొదలైన వర్షం మధ్యాహ్నానికి భారీ వర్షం కురిసింది. చిత్తలూరులో భారీగా వర్షం కురవడంతో వీధులు జలమయం అయ్యాయి. ఈ వర్షంలో రైతులు ఆనందంగా ఉన్నారు.

పశు సంరక్షణతో పాడి వృద్ధి



డీఎల్‌డీఏ ఈఓ సోమయ్య, ఏడీ జయచంద్ర, డాక్టర్ సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

సంగం: పశు సంరక్షణతో పాడి పరిశ్రమ వృద్ధి చెందుతుందని పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ బి మహేశ్వరుడు చెప్పారు. మండలంలోని తరుణవాయి రైతుభరోసా కేంద్రంలో సోమవారం పాడి రైతులకు పశు విజ్ఞానబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతులకు పెయ్యదూడల ఉత్పత్తి పెంచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించి పలు సూచనలు చేశారు. రైతులకు మందులను పంపిణీ చేశారు. అనంతరం యానిమల్ హస్బెండరీ అసిస్టెంట్లకు కృత్రిమ గర్భధారణకు సంబంధించిన ఏఐ క్యాన్లను పంపిణీ చేశారు. రైతులు పెయ్య దూడలను ఉత్పత్తి చేయడం వల్ల పాల ఉత్పత్తిని పెంచుకుని అధిక లాభాలు పొందవచ్చునన్నారు. ఈ నెలలో 14 లక్షల గొర్రెలకు టీకాలు వేయనున్నట్లు పేర్కొన్నారు.

మార్మోగిన శివ నామస్మరణ



కావలి: శివాలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

కావలి: శివుడికి అత్యంత ప్రీతికరమైన మాసం కార్తీక పౌర్ణమి, అందులో సోమవారం కావడంతో కావలి పట్టణంలోని పాతూరు శివాలయం భక్తులతో కిటకిటలాడింది. భక్తుల శివనామస్మరణతో ఆలయం మార్మోగింది. సోమవారం తెల్లవారు జామున నుంచే భక్తులు మల్లికార్జున స్వామికి అభిషేకాలు చేశారు. ఆలయ ప్రాంగణంలో దంపతులు, మహిళలు పెద్ద సంఖ్యలో వచ్చి దీపాలను వెలిగించారు.



కలిగిరి: శివాలయంలో దీపాలు వెలిగించి పూజలు చేస్తున్న మహిళలు

దుత్తలూరు: మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం కార్తీక పౌర్ణమి వేడుకలను భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దుత్తలూరు సంజీవ శిఖరంపై రామలింగేశ్వరస్వామి సన్నిధిలో మహిళలు పెద్ద ఎత్తున భక్తిప్రపత్తులతో దీపారాధన చేశారు. స్వామి వారిని పంచామృతాలతో అభిషేకించి సర్వాంగ సుందరంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. మండలంలోని కొత్తపేట, నర్రవాడ, నందిపాడు శివాలయాల్లో మహిళలు కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు.



ఆత్మకూరురూరల్: గండ్లవేడులో కార్తీక పౌర్ణమి సందర్భంగా సహస్ర లింగార్చన నిర్వహిస్తున్న దృశ్యం

కలిగిరి: మండలంలో కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని సోమవారం మహిళలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. కలిగిరిలోని శ్రీపర్వతవర్ధిని నాగమల్లేశ్వర స్వామి, సిద్ధనకొండూరులోని సిద్ధేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు ఉపవాసాలు ఉండి మొక్కులు చెల్లించుకున్నారు.

ఆత్మకూరురూరల్: మండలంలోని గండ్లవేడులో సోమవారం కార్తీక పౌర్ణమి ఘనంగా నిర్వహించారు. బద్వేల్‌కు చెందిన సహస్రాధిక ప్రతిష్ఠాచార్యులు కనుమళ్ల సత్యనారాయణశర్మ ఆధ్వర్యంలో సహస్ర లింగార్చన, మహన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకం, లక్ష్మీగణపతి హోమం, నవగ్రహ విశేష రుద్రహోమాలు నిర్వహించారు. గ్రామానికి చెందిన కొల్లి అఖిల్‌నాయుడు, దొరస్వామినాయుడు కుటుంబ సభ్యులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.



సిద్ధేశ్వరంలో ఇష్టకామేశ్వరి అమ్మవారి ఆలయం వద్ద పూజలు నిర్వహిస్తున్న భక్తులు

సీతారామపురం: కార్తీక పౌర్ణమి సందర్భంగా మండలంలోని సిద్ధేశ్వరం, భైరవకోన, రామయ్యస్వామి శివాలయంలో భక్తులు సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సిద్ధేశ్వరంలో మహిళలు కార్తీక దీపాలు వెలిగించి శివుడికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇష్టకామేశ్వరి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. భైరవకోనలో జారువారే జలపాతం వద్ద భక్తుల సందడి నెలకొంది. ఒకే రాతిలో మలిచిన అష్టదేవాలయం వద్ద భక్తులు పూజలు నిర్వహించారు.



ఆత్మకూరు: శివాలయంలో రుద్రహోమం అనంతరం పూర్ణాహుతి సమర్పిస్తున్న భక్తులు

ఆత్మకూరు: పవిత్రమైన కార్తీక మాసాన్ని పురస్కరించుకుని పట్టణంలోని పలు ఆలయాలు భక్తులతో కిక్కిరిశాయి. సోమవారం, పౌర్ణమి తిథి రావడంతో అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి ఏకాదశ రుద్రాభిషేకాలు, అన్నపూర్ణ అమ్మ వారికి లలితా సహస్ర నామపూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అర్చకులు, మేళ్లచెరువు శివకుమార శర్మ ఆధ్వర్యంలో విఘ్నేశ్వరుడికి, మహాశివుడికి నవగ్రహాలకు మూలమంత్రాలతో హోమం నిర్వహించారు. ఈశ్వరుడికి రుద్రహోమం ప్రత్యేకంగా నిర్వహించారు. శాంతి హోమం నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. అనంతరం శివపార్వతుల కల్యాణం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో మహిళలు పెద్ద ఎత్తున కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. సమీపంలోని చెరువు వద్ద దీపాలు వెలిగించి నీళ్లల్లో వదిలారు.



కోటీతీర్థం శివాలయంలో..

చేజర్ల: కార్తీక సోమవారాన్ని పురస్కరించుకుని మండలంలోని శివాలయాల్లో భక్తులు విశేష పూజలు నిర్వహించారు. చేజర్ల శివాలయంలో సోమవారం ఉదయం నుంచి మహిళలు దీపాలు వెలిగించారు. మండలంలోని ప్రసిద్ధ కోటితీర్థం కోటేశ్వరస్వామి ఆలయంలో అభిషేకాలు పూజలు నిర్వహించారు. ఆ ఆలయాన్ని ఆనుకుని ఉన్న పవిత్రమైన పెన్నానదిలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. సోమవారం సాయంత్రం వరకు మహిళలు దీపాలు వెలిగించి పూజలు చేసి తమ వ్రతాన్ని విరమించారు.



భస్మాభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

పరమేశ్వరుడికి మహాభస్మాభిషేకం

ఉదయగిరి: మండలంలోని గండిపాళెం సిద్ధేశ్వరాలయంలో పరమేశ్వరుడికి సోమవారం మహాభస్మాభిషేకం అర్చకులు వైభవంగా నిర్వహించారు. పరమేశ్వరుడికి 21 కేజీల భస్మంతో అభిషేకం చేశారు. మండలంలోని సున్నంవారిచింతల, అప్పసముద్రం, అర్లపడియ, యర్రబల్లిగడ్డ, లింగాలదొన, అయ్యవారిపల్లి, తదితర గ్రామాలతో పాటు పట్టణంలోని పార్వతీ పరమేశ్వర ఆలయంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్తీక దీపాలు వెలిగించి పూజలు నిర్వహించారు.

సిద్ధులకోనలో మేకపాటి ప్రత్యేక పూజలు



సిద్ధులకోన శివాలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న మేకపాటి

మర్రిపాడు: కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని మండలం చాబోలులోని సిద్ధులకోన శివాలయాన్ని ఉదయగిరి సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు దుగ్గిరెడ్డి కృష్ణప్రసాద్‌రెడ్డి, ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గాల వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.

వైభవంగా లలితా మహారుద్ర యజ్ఞం



యజ్ఞంలో పూర్ణాహుతి సమర్పిస్తున్న భక్తులు

సంగం: సంగం తిరుమనకొండ రాజరాజేశ్వరిదేవి సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న లలితా రుద్ర మహాయజ్ఞం సోమవారం వైభవంగా జరిగింది. సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసి సకల జనులు సుభిక్షంగా ఉండాలని అక్టోబర్ 15వ తేదీ నుంచి ప్రారంభమైన లలితా రుద్ర మహాయజ్ఞం సోమవారంతో 45 రోజులు పూర్తయింది. ఆలయంలోని స్వామి, అమ్మవార్లకు సకల ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో యజ్ఞం నిర్వహించి పూర్ణాహుతి వేశారు.

గురు దంపతులకు సన్మానం

ఆలయ పీఠాధిపతి రాజరాజేశ్వరానందస్వామి దంపతులతో పాటు పలువురు గురువులను లలితా రుద్ర మహాయజ్ఞం పూర్తయిన అనంతరం భక్తులు ఘనంగా సన్మానం చేశారు. ఆ ఆలయానికి విచ్చేసిన 100 మంది దంపతులు గురువును సత్కరించి పూలాభిషేకం చేశారు. అనంతరం పీఠాధిపతి రాజరాజేశ్వరానందస్వామి యజ్ఞం విశిష్టతను గురించి భక్తులకు వివరించారు. భారీగా అన్నదానం నిర్వహించారు.

అంగరంగ వైభవంగా అయ్యప్ప పడి పూజ



వైభవంగా అయ్యప్పస్వామి పడి పూజ అలంకరణ

ఆత్మకూరు: కార్తీక మాసం పౌర్ణమి పుణ్యతిథిని పురస్కరించుకుని పట్టణంలోని అలఘునాథస్వామి ఆలయం వద్ద అంగరంగ వైభవంగా అయ్యప్పస్వామి మెట్ల (పడి) పూజను సోమవారం రాత్రి నిర్వహించారు. భారీ సెట్టింగ్‌లతో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై గణపతి, సుబ్రహ్మణ్యస్వామి, అయ్యప్ప విగ్రహాలను ఏర్పాటు చేసి శోభాయమానంగా అలంకరించారు. ప్రత్యేక పూజల అనంతరం స్వామి వారి భక్తి గీతాలు, భజనలు నిర్వహించారు. పట్టణంతో పాటు వివిధ గ్రామాల నుంచి భారీ సంఖ్యలో అయ్యప్పస్వాములు, మహిళలు ఈ పడి పూజలో పాల్గొన్నారు. పూజల అనంతరం ప్రసాద వినియోగం చేశారు. దాత కంచి పరమేశ్వర రెడ్డి పూజలకు ప్రసాదాలకు సహకరించారు.